# ప్రేమ

ఆకాశాన్నించి భూమికి ఏకధారగా కురుస్తోంది వర్షం. ఆకాశం మధ్య మధ్య భయంకరంగా ఉరుముతోంది.

సాయంత్రం అయిదు గంటలు కాకపోయినా, కారు మబ్బులు కమ్మడం మూలాన నలుమూలలా చీకట్లావరించేశాయి.

రివ్వున వీచిన గాలికి దగ్గరగా వేసున్న తలుపులు దఢాల్న తెరుచుకుని జల్లుతో సహా చల్లని గాలి లోపలి కొచ్చింది.

కుర్చీలో కూర్చుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న రాధ ఉలిక్కిపడి లేచి తలుపులు మూసి గడియ పెట్టింది. తెరిచివున్న కిటికీ తలుపులు కూడా మూసి, ఓసారి భర్త గదిలోకి తొంగి చూసింది.

అతను ఆదమరచి నిద్రపోతున్నాడు.

తేలిగ్గా నిట్టూర్చి మళ్ళీ కుర్చీలో కూలబడి తిరిగి ఆలోచనల్లో కెళ్ళిపోయింది రాధ.

రాధా మాధవులది ప్రేమ వివాహం. మాధవ్ ది అగ్ర

కులం. రాధ హరిజన కులంలో పుట్టింది. అందంగా ఆకర్ష ణీయంగా ఉంటుంది.

కాలేజీలో చదువుతూండగా ఎలా కలిశారో గానీ ఇద్దరి మనసులూ కలిశాయి. ఒకరి తోడిదే మరొకరి లోకం అనుకున్నారు. భయపడుతూనే పెద్దలకి చెప్పారు.

నిగతాది మామూలే!

వారి పెళ్ళికి యిరుపక్షాలవారు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు.

బతిమాలి, బెదిరించి చూసి చివరికి లాభం లేదనుకున్న రాధామాధవులు దైవ సాన్నిధ్యంలో పెళ్ళి చేసుకుని దంపతు లయ్యారు.

ఆపై కాపురం పెట్టి బాధలు పడ్డా ఓర్పుగా వాటిని తట్టుకుని, కష్టపడి చెరో ఉద్యోగమూ సంపాదించుకున్నారు.

రెండేళ్ళు అతి మధురంగా గడిచిపోయాయి. ఆ రెండేళ్ళలో ఎవరికీ తల్లిదండ్రులుగానీ బంధుజనంగానీ గుర్తే రాలేదు. 'అన్యోన్య దాంపత్యం' అంటే ఇలా వుండాలి! అని పించేలా గడిపారు.

అయితే వారి అన్యోన్యం చూసి దేవుడు సహించలే దన్నట్లు మాధవ్ ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింది. డాక్టర్‌కి చూపిస్తే అతని రోగానికి సింపుల్‌గా 'క్షయ' అని పేరు పెట్టాడు.

మాధవ్ ముఖం పాలిపోయింది.

రాధ తల్లడిల్లి పోయింది.

విషయం ఎలా తెలిసిందో ఉరుకులు పరుగులతో వచ్చి పడ్డారు, మాధవ్ తల్లిదండ్రులు.

కొడుకుని చూసి కంటతడి పెట్టుకున్నారు.

"ఈ భ్రష్టురాల్ని చేసుకున్నావ్ కాబట్టే నీకీ రోగం వచ్చింది!" అంటూ ఆ కారణంగా రాధని తిట్టిపోశారు.

యిలాంటి రోగాలు మన ఇంటా వంటా లేవని వాపోయారు.

తమతో వచ్చెయ్యమని బ్రతిమాలారు.

మంచి డాక్టర్‌కి చూపించి మూడు రోజుల్లో తగ్గించేస్తామన్నారు!

ఇలా చాలా చెప్పారు.

అయితే మాధవ్ దేనికీ అంగీకరించలేదు. కావాలని చేసుకున్నాం. కష్టమో నిష్టూరమో ఆమెతోడిదే లోకం అన్నాడు.

అయినా నా రోగానికి తనేం చేస్తుందీ తన దగ్గర్నించి అంటిందా?" వాదించాడు.

అటు సూర్యుడిటు పొడిచినా రాధని వొదిలి రానన్నాడు.

చెప్పి చెప్పి విసిగిపోయిన తల్లిదండ్రులు కొడుకునంతగా మార్చేసిన రాధని దుమ్మెత్తిపోస్తూ వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళగానే, క్షణం భర్త కళ్ళల్లోకి చూసింది

రాధ. అతని కళ్ళల్లో ఎన్నో అనురాగ సాగరాలు కనిపించాయామెకు. వెంటనేఅతని కాళ్ళకి చుట్టేసింది ఆర్తిగా.

*   *   *

డాక్టర్ దగ్గర మందులు వాడుతూనే ఆఫీసుకి వెళ్ళొస్తున్నాడు మాధవ్. అయితే జబ్బు తగ్గే సూచనలేంలేవు సరిగదా మరింత నీరసించిపోయాడు.

మాధవ్ కన్నా రాధకే దిగులెక్కువయింది.

ఆ రోజు డాక్టర్ దగ్గరికెళ్ళొచ్చాక ఆమె మొహం మరీ పాలిపోయింది. దుఃఖం తన్నుకొస్తోంది. అయినా దాన్ని వెనక్కి నెట్టి అకారణంగా నవ్వుతూ, అర్థంలేని జోక్స్ వేస్తూ భర్తని ఆనందపరచాలని విశ్వప్రయత్నం చేస్తోంది. డాక్టర్ చెప్పిన మందులన్నీ వాడుతోంది. అయినా మాధవ్‌లో మార్పు లేదు.

తప్పనిసరిగా ఆఫీసుకు సెలవు పెట్టాడు మాధవ్. ఒకటి రెండుసార్లు నోట్లోంచి రక్తం కూడా పడింది. డాక్టర్ రోజూ ఇంటికొచ్చి చూస్తూన్నాడు.

మాధవ్ మొహంలో మృత్యుభయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పదే పదే భార్యతో-

"రాధా! నేను బ్రతుకుతానంటావా?" అని అడిగేవాడు జాలిగా.

"ఛ! ఛ! అవేం మాటలండీ! ఈ రోజుల్లో యిదో పెద్ద జబ్బుకిందే లెక్క కాదు... నేను డాక్టర్‌గారితో మాట్లాడు

తూనే ఉన్నాను. మీకేం పరవాలేదన్నారు." అని అతన్ని మభ్యపెడుతూ వచ్చింది రాధ.

కాస్త తేరుకునేవాడతను.

అలాంటి సమయంలో రాధ తల్లి వచ్చింది కూతుర్ని చూడ్డానికి. అయితే ఆమె ఆశించినంత ఆదరణ లభించలేదామెకి కూతురిదగ్గర్నించి.

"ఏమిటే ఇలావచ్చావ్?" అంది రాధ పొడిగా.

"అదసలే చెడురోగం! అది నీకూ అంటుద్ది? నామాటిని మనూరొచ్చెయ్!" అంది తల్లి రహస్యంగా.

ఆ మాట భర్త చెవినెక్కడ పడుతుందో అన్నట్టు భయంగా చూసి తల్లిని చరచరా పెరట్లోకి ఈడ్చుకుపోయింది రాధ.

"ఏటే? అదంటురోగం కాదేటి... మొన్న మన అప్పలనరసిమ్మల్లుడికొచ్చి ఇట్టే మొగిరిపోనాడు! నీకెందుకు నువ్వు బయపడ్దేరు! ఎలాగో ఆల్ల బాబూవాల్లొచ్చారంటగా? ఆడికి పోతాడు! నువ్ మాకాడికొచ్చెయ్!" అంది మళ్ళీ గొంతు తగ్గించి తల్లి.

తల్లిని నిప్పులు కురిసేలా చూసింది రాధ.

"చేసిన పరామర్శ చాలుగానీ...తక్షణం ఇక్కణ్ణించి వెళ్ళు!" అంది కఠినంగా.

రాధ తల్లి ఇంకేదో చెప్పబోతుంటే కసిరికొట్టింది. తల్లి యేదో గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

ఆ తరవాత వారం రోజులకి తల్లి పోయిందన్న వార్త విని వెళ్ళి చూడలేని రాధ తన ఇంట్లోనే కూలబడి కరువుతీరా ఏడ్చింది.

*　　*　　*

మరో రెండు నెలలు గడచి పోయాయి.

మాధవ్ నానాటికీ క్షీణించి పోతున్నాడు. ఆదిగులుతో రాధ అతనికన్నా నీరసించి పోయింది. అలాగే ఓపిక చేసుకుని ఆఫీసు కెళ్ళొస్తూ, భర్తని చూసుకుంటోంది. ఒకటి రెండుసార్లు ఆఫీసులో కళ్ళు తిరిగి పడిపోయిందికూడా.

అలాంటి సమయంలో మాధవ్‌లో చిత్రమయిన మార్పు వచ్చింది.

ప్రాణ భయం అతన్ని భూతంలా భయపెడుతోంది. తను మంచంలో నిస్సహాయంగాపడుకునుంటే భార్య మామూలుగా ఆఫీసు కెళ్ళడం అదీ అతి దారుణమయిన విషయాలుగా కనిపిస్తున్నాయతనికి. అందుకే రాధ మీద అకారణంగా మండి పడడం ప్రారంభించాడు.

రాధ ఆఫీసు కెళ్తూంటే—

"ఏమిటా షోకులు?, నేనిలా మంచంలో పడేసుస్తుంటే నీకేం పట్టనట్లు అలా వీధిలో తిరుగుతావేమిటే?" అనీ, డాక్టర్‌తో మాట్లాడుతుంటే, కొరకొరా చూసి, ఆయనటు వెళ్ళగానే.

"ఆ డాక్టర్ వెధవతో ఏమిటా వికవికలు? సిగ్గులేదూ?

అసలు వాడు సరిగ్గా మందులు ఇవ్వడంలేదు, ఇస్తే మీ ఇద్దరి సరసాలకే ఎక్కడ ఆటంకం వస్తుందో అని," అంటూ బాకు ల్లాంటి మాటలు విసిరేవాడు.

"నాచావు కోరుతున్నావు. అవున్లే అలగా బుద్ధులు ఎక్కడికి పోతాయ్!..." అంటూ అసహ్యించుకునేవాడు.

రాధ అతని మాటలకి గిలగిల్లాడిపోయింది. అతనిలోని మార్పుకి కుళ్ళికుళ్ళి యేడ్చింది. యెన్నో విధాల నచ్చచెప్పా లని చూసి ఓడి పోయింది. చివరికా తిట్లకి బాగా అలవాటు పడిపోయింది.

కళ్ళల్లో ప్రాణాలున్నట్టున్న రాధని చూసి ఆఫీసర్, కొలీగ్స్ అంతా కలిసి ఆమెచేత బలవంతంగా శెలవు పెట్టిం చారు. ఎందుకయినా పనికొస్తుందని కాస్త డబ్బు కూడా యిచ్చారు.

అది చూసి మరీ మండిపడ్డాడు మాధవ్ ఆ డబ్బు ఇవ్వ డానికి, యెన్నో నీచమయిన కథల్లి, అసలే పాలిపోయివున్న రాధని ఘోరమయిన పదజాలంతో మరీ పాలిపోయేలా చేశాడు.

ఆవేశపడి, హైరానపడి, నీరసంగా కూలిపోతున్న భర్తను చూసి ఒణికిపోయింది రాధ.

మర్నాడు భర్త గురించి డాక్టర్ని అడిగింది ఇవతలగా తీసుకొచ్చి

"ఎక్సరేలో మార్పుందమ్మా, మనిషికూడా ఫరవా లేదు! కానీ, ఆయన మానసికంగా యేదో బాధపడుతున్నారు. జబ్బు తగ్గాలంటే రోగి కోపరేషన్ కూడా ఉండాలిగా?" అన్నా డాయన యేదో ఆలోచిస్తూ.

రాధ మొహం పాలిపోయింది.

"అయితే...ఆయనకి, తగ్గదంటారా డాక్టర్?" తడారి పోతున్న గొంతుతో అంది.

"ఎందుకు తగ్గదు?... తగ్గుతుంది! కానీ"

"ఊఁ! కానీ? చెప్పండి డాక్టర్!"

"కాస్త టైం పడుతుంది!"

"అంటే...ఎంత కాలం?"

"అదెలా చెప్పగలమమ్మా!, మందిస్తాం గానీ మేము దేవుళ్ళం కాదు కదా?" జాలిగా అన్నాడు డాక్టర్.

"నిజమే"! భారంగా నిట్టూర్చింది రాధ.

"అయితే, ఆయన మనసెంత ప్రశాంతంగా వుంటే అంత తొందరగా జబ్బు నయం అవుతుంది. ఆయనెంత ఆనం దంగా వుంటే అంత త్వరగా కోలుకుంటారు" అన్నాడు డాక్టర్.

"డాక్టరేమన్నాడు?" నీరసంగా అడిగాడు మాధవ్, డాక్టర్ని పంపి లోనికొచ్చిన భార్యతో.

"తగ్గిపోతుందన్నారు! మీరు మాత్రం ధైర్యంగా ఆనం దంగా ఉండాలన్నారు!" నవ్వుతూ అంది రాధ.

"నేనీ స్థితిలో వుంటే నీకు నవ్వెలా వస్తోందే?" అరిచాడు మాధవ్.

"మరి నవ్వకేం చెయ్యను చెప్పండి! మీరు ప్రతిదానికీ చిన్నపిల్లాడిలా భయపడిపోతున్నారు. అసలు ఈ రోజుల్లో ఈ జబ్బు తగ్గని వాళ్ళే లేరు! తెలుసా? అందుకే మీ అమాయకత్వానికి నవ్వొస్తోంది." అతని తల నిమురుతూ అంది రాధ.

"వస్తుంది! ఎందుకురాదు! నాబాధ నీకేం తెలుస్తుందే! నా స్థితిలో నువ్వే ఇక్కడ పడుంటే ఆ మరణ భయం అంటే యేమిటో తెలిసేది! కానీ నువ్వు నన్నిలా వదిలేసి నీ ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నావ్" కచ్చగా అన్నాడు మాధవ్.

రాధ మళ్ళీ నవ్వింది.

"ఎందుకా నవ్వు?" గర్జించినట్లు అన్నాడు.

"మీ అమాయకత్వానికి!"

"అంటే, నా చావు నీకు ఆనందంగా వుందన్నమాట! నానిస్సహాయత్వం నీకమాయకత్వంకింద కనిపిస్తోంది! అంతేనా!" ఆవేశంగా అరిచాడతను.

"మీ మనసు బాగాలేదు! మీరు పడుకోండి. అందరం యెప్పుడో ఒకప్పుడు మరణ వేదన పడాల్సిందే. దాన్ని గురించి ఊరికే ఆలోచిస్తూ, మనసు పాడుచేసుకుని ఆరోగ్యాన్ని మరింత పాడుచేసుకోకండి." శాంతంగా అంది రాధ.

"అంటే... నేను పోతానన్నమాటేగా?"

"ఛ! ఛ! అదేంకాదండీ! రేపు నేనే పోవచ్చు! మీరు ఎంచక్కా లేచి తిరగచ్చు! తిరుగుతారు కూడా. అయినా ఇంక ఆ ధోరణి మానెయ్యండి. చావుని గురించి మనం భయపడుతున్నకొద్దీ అది మనల్ని మరింత భయపెడుతుంది. మనసు మొండికేస్తే అదీ మనకు దూరంగా పారిపోతుంది. అందుకే, ఇంక మీరు చావును గురించి ఆలోచించవద్దు! మన భావి జీవితాన్ని గూర్చి తియ్యగా ఊహించుకోండి. త్వరలో కోలుకుంటారు!" అంది రాధ ఎంతో ఓర్పుగా.

తను మరణ వేదన అనుభవిస్తున్నా అంత హాయిగా మాట్లాడుతున్న భార్యని తిట్టితిట్టి అలసిపోయిన మాధవ్ అలాగే నిద్రలోకి జారిపోయాడు.

* * *

పెద్దగా ఉరిమి లైట్లు పోయాయి.

గతంలోకి వెళ్ళిన రాధ వర్తమానంలో కొచ్చింది. మెల్లగా లేచి లాంతరు వెలిగించి భర్త దగ్గరి కెళ్ళింది.

ఎంతో అందంగా హుందాగా ఉండే భర్త అలా తెల్లగా పాలిపోయి, బల్లిలా మంచాని కతుక్కుపోయి వుండడం చూస్తుంటే ఆమెకి దుఃఖం ఆగలేదు.

భర్త కెక్కడ మెలకువ వస్తుందో అని చటుక్కున బైటికొచ్చి భోరుమంది.

ఓదార్చే దిక్కులేదు.

కనీసం తన మనసు విప్పి చెప్పుకుని ఊరట చెందడానికి భర్త ఆదరణకూడా లేదు.

నిస్త్రాణగా అలా కూలబడి మోకాళ్ళలో తలదాచు కుంది రాధ.

ఆమెకి వెక్కి-వెక్కి ఏడ్చే పెద్ద ఓపికూడా లేదు. తిండి తినకపోయినా తినలేదేం అనే ప్రాణి లేదు.

మాధవ్ కన్నా నీరసించి పోయింది!

కాళ్ళు లాగుతున్నాయి!

కళ్లు తిరుగుతున్నాయి!

అలాగే తూలుకుంటూ లేచి భర్తకి హార్లిక్స్ కలిపి చ్చింది. ఇంతలో కరెంట్ వచ్చింది.

దైవానుగ్రహమో, డాక్టర్ల కృషి ఫలితమో మాధవ్ కాస్త కోలుకున్నాడు. రోగం తిరుగు ముఖం పట్టింది.

అతని కళ్ళలో మృత్యు భయంతగ్గి కాస్త కాంతి వచ్చింది.

రాధ కళ్ళు ఆనందంతో వెలిగిపోయాయి.

క్షీణించిన శరీరం ఆనందంతో పులకించింది.

పుల్లల్లావున్న చేతులెత్తి ఆ దైవానికి కృతజ్ఞతలు చెప్పు కుంది.

ఇరుగు పొరుగులు-

"ఇంకనయినా కాస్త నీ సంగతి చూసుకో తల్లీ! అతని జబ్బు కాదుగానీ, నీ ప్రాణం మీదికి తెచ్చుకొనేలా ఉన్నావు! అంటూ మందలించారు.

రాధ తియ్యగా నవ్వింది!

"ఇంక నాకేం పరవాలేదు! నాకేం భయంలేదు, దిగు ల్లేదు! నా మాధవ్‌కి తగ్గిపోయింది! ఇంక నా మాధవ్ నీడలో హాయిగా, నా మాధవ్ నీడలో వెచ్చగా" అనుకొని పరవశించి పోయింది.

అదోలాంటి మైకంలో, స్వప్నజగత్తులో ఉన్నట్టున్న రాధ "మాధవా!" అన్న పిలుపుతో త్రుళ్ళిపడి ఈ లోకంలో కొచ్చింది.

ఆమె కల చెదిరింది!

ఎదురుగా మాధవ్ తల్లి.

కంగారుగా లేచి ఆహ్వానించింది రాధ.

రాధ కేసి ఓ విషపు చూపువిసిరి లోపలి కొచ్చిందామె.

"మాధవా!" అంది కొడుకు దగ్గరకొచ్చి.

మాధవ్ కళ్లు తెరిచాడు.

అతని కళ్ళు తళుక్కుమన్నాయి.

"వచ్చావామ్మా" అన్నాడు ఆనందంగా.

"రాకుండా ఎలావుంటాన్రా! యెంతయినా కన్నప్రాణం నీ ఉత్తరం చూశాక ఉన్నపాటున పరిగెత్తుకొచ్చాను." కళ్ళు ఒత్తుకుందావిడ.

"ఉత్తరం రాశారా!" అప్రయత్నంగా అంది రాధ.

"ఏం! రాయకూడదా!" కస్సుమంది.

"అదికాదండీ..."

"ఏది కాదు? మాధవ్ నాకన్న కొడుకు. వాడంత రోగ మొచ్చి చచ్చి బతికి, తల్లినిచూడాలని ఉత్తరంరాస్తే, అదేదో పెద్ద నేరం చేసినట్టడుగుతావేమిటె!"

రాధ అయోమయంగా చూసిందామె కేసి.

ఆరోజు వరండాలోనే వుండిపోయింది. అత్తగారికి పనికి రాదని. ఆవిడే ఇంత వండి హాల్లోకి తెచ్చి పడేసింది రాధకి భోజనం పెట్టిదాని కేసినట్టు.

దానికామె బాధపడలేదు గానీ, మాధవ్ ప్రవర్తనే వింతగా ఉందామెకి.

అతను తన ఉనికే గమనించనట్టు, ప్రవర్తిస్తున్నాడు. అయినా ఆవిడెన్నాళ్లుంటుందిలే! ఆపై మాధవ్ మామూలు వ్యక్తయిపోతాడు. అనుకుని సరిపుచ్చుకుంది. అయితే ఆమె ఊహ పూర్తిగా తప్పని మర్నాటిగ్గానీ తెలియలేదామెకి.

రాధ నిద్రలేచేసరికి తల్లి కొడుకులు సామాన్లు సర్దుతున్నారు.

మెల్లగా తూలుకుంటూ వస్తున్న రాధ తన పేరు విని పించడంతో క్షణం గడప నాసరాగా చేసుకుని నిల్చింది.

"అమ్మా! రాధ మరీ జీవచ్ఛవంలా అయిపోయింది." ఎక్కడో మాధవ్ మాటల్లో జాలి.

"దానికి నువ్వేంచేస్తావురా! చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత." అన్నాడు. అయినా అదేం తెలివి తక్కువదికాదు. ఈ సరికే జాగ్రత్త పడుంటుంది మనం అటు వెళ్ళగానే జామ్మంటూ లేచి తిరుగుతుంది!" అంది మాధవ్ తల్లి.

"కానీ..."

"ఇదిగో! మధూ! నువ్వు అయిందానికీ, కానిదానికీ ఊరికే ఆలోచించి హైరాన పడకు. ఆ రాధ సంగతి కొన్నాళ్లు మర్చిపో. అసలు నాకే అనుమానంగా ఉందిరా మాధవా." గొంతు తగ్గించి అందావిడ.

"ఏమిటమ్మా!"

"దానికీపాటికే . సీరోగం అంటుకుంటుంది. అందుకే అలా పీనుగులా అయిపోయింది. నువ్వా చచ్చి బతికావు. ఇంకేం ఆలోచించకుండా బయలుదేరు. దానికా డాక్టరు గారు మందిస్తాళ్ళే." నిరసనగా అంది.

"అవును, ఆ డాక్టర్‌కి రాధంటే చాలాఇష్టం. ఎప్పుడూ తనకేసి జాలిగా, ఆరాధనగా చూస్తాడు. ఒకటి రెండుసార్లు వాళ్ళు రహస్యంగా మాట్లాడుకుంటూ నేనొచ్చే సరికి ఆగిపోయేవారు. అది తన జబ్బు విషయం మాత్రంకాదు, అది కచ్చితంగా తెలుసు." అందామనుకున్నాడు మాధవ్ తల్లితో. కానీ అనలేదు. అతని మొహం మాత్రం కఠినంగా అయిపోయింది.

"సరే! తొందరగా సర్దెయ్యి. ట్రయిన్‌కి టయమవుతోంది!" అనేశాడు.

తల్లి ఉత్సాహంగా సర్దుతోంది.

ఇదంతా విన్న రాధ భూకంపం వచ్చినట్లు ఒణికిపోయింది. సర్వం మరిచి తుఫాన్‌లా గదిలోకొచ్చి.

"ఎక్కడకీ ప్రయాణం!" అంది ఆయాసపడుతూ నే.

"ఏంలేదు రాధా! నాకు కొన్నాళ్లుపాటు అమ్మా వాళ్ళ దగ్గరుండాలనుంది. అందుకే అమ్మని రమ్మని రాసాను!" తాపీగా అన్నాడు మాధవ్.

"అంటే?" రాద కాళ్లు స్వాధీనం తప్పుతున్నాయి.

"అంటే ఏముందీ... నేనో ఏడాది పాటు మా వూరెళ్ళి పోతాను. నాన్న నా ఉద్యోగం అక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయిస్తానన్నారు."

"మరి..;మరి నేను?"

"నీకెలాగూ జాబ్ వుందిగా, ఎలగో వుండిపో. ఓ ఏడాదేగా! ఆ తరవాత వచ్చేస్తాను." తేల్గ్గా అనేశాడు మాధవ్.

"మీరు నన్నొదిలి వెళ్ళిపోతారా?"

పాలిపోయిన మొహంతో నమ్మలేనట్టు అంది రాద.

"ఛ! ఛ! వదలటం కాదు, జస్ట్ కొన్నాళ్ళు..."

"వద్దు మాధవ్! ప్లీజ్! నన్నొదిలి వెళ్ళద్దు. ఈ స్థితిలో నన్నొంటరిగా వదిలి వెళ్ళొద్దు మాధవ్." హటాత్తుగా అతని కాళ్లు చుట్టేసి ఏడవడం మొదలు పెట్టింది రాద.

"ఇదేం గోల! ఓ మూల బిడ్డ చచ్చి బతికాడని తీసి కెళ్తుంటే" విసుక్కుంది అత్తగారు.

"లేదండీ! ఆయన లేకపోతే నేను బ్రతకలేను. ఇప్పుడు ఆయన్ని నానుంచి దూరం చెయ్యకండి. మీకంతగా తీసికెళ్ళా లనుంటే ఇంకోనెలో, రెణ్ణెల్లో ఆగి తీసికెళ్ళండి. ఈలోగా

ఆయనా కోలుకుంటారు, నేనూ కోలుకుంటాను ప్లీజ్!" అంటూ అత్తగారి కాళ్లు పట్టుకుని బ్రతిమాలింది రాధ.

"ఛీ! వెధవసంత!" అంటూ కాళ్లు లాక్కుందావిడ. మాధవ్ మాట్లాడలేదు.

"ఒక్కసారి నా కళ్ళలోకి చూడండి. జీవచ్ఛవంలా ఉన్నాను. దయచేసి, ఈ స్థితిలో నన్నొదిలి వెళ్ళకండి!" మళ్ళీ బ్రతిమాలింది రాద.

ఆమె మాట మెవరూ విన్లేదు. రాద గొంతు మూగవోయింది. ఆమెకి ఏడుపుకూడా రావడంలేదు. జరిగేదంతా ఓ బొమ్మలా చూస్తోంది.

అన్ని సామాన్లూ తీసుకుని—

"మేం వస్తాం!" అన్నాడు మాధవ్ పొడిగా. అతనికి, అస్థిపంజరంలా వుండి ఏ క్షణానయినా స్పృహపోవచ్చేమో అన్నట్టున్న రాదని చూస్తే బాధతో మనసు మూలిగింది. వెంటనే తను మంచంలో ఉండి నరకయాతన పడుతుంటే తను కులాసాగా తిరుగుతూ ఆ డాక్టర్‌తో నవ్విన నవ్వులు, గుసగుసలు గుర్తొచ్చి మళ్ళీ కఠినంగా అయిపోయింది.

"మేం వెళ్తున్నాం!" మళ్ళీ అన్నాడు మాదవ్. మౌనంగా తలఊపి రెండు చేతులూ జోడించింది రాద. ఆమె కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. చాలా సేపటి తరువాత.

మాదవ్ అతని తల్లి వెళ్ళిపోయారు. రాద నిస్త్రాణగా కూలిపోయింది.

మాదవ్ వెళ్ళిన నాలుగో రోజున అతనికి టెలిగ్రాం వచ్చింది. రాధకి సీరియస్‌గా ఉంది వెంటనే రమ్మని.

తప్పు చేసానేమో అని ఆత్మ విమర్శనలో కొట్టుకొంటున్న మాదవ్ ఆ టెలిగ్రాం చూసి ఒణికిపోయాడు.

"అంతా వట్టిదిరా! నిన్ను రప్పించడానికిదో నాటకం! వెధవ అలగా బుద్దులు!" మూతి తిప్పింది తల్లి.

అయినా మాదవ్ మనసు ఆగలేదు.

అది ప్రేమో, భయమో, లేక పాపభీతో అదీగాక సంఘానికి దడవడమో తెలియదుగానీ, వెంటనే బయల్దేరాడు.

అతను వెళ్ళేసరికి రాధ శవం అంతిమ యాత్రకి సిద్ధంగా వుంది.

"అదిగో! వచ్చాడు! ఆయనే భర్త! ఉన్నన్నాళ్ళూ వుండి, ఈ స్థితిలో వదిలి పోయాడు." అలాంటి మాటలు గుసగుసలుగా వినిపించాయతనికి.

అందుకతను బాధ పడలేదు కానీ, రాదని చూస్తేనే కొయ్యబారిపోయాడు. నోట మాట రావడంలేదు

అతన్ని చూసి అందరూ మొహాలు చిట్లించారు.

క్షణం తర్వాత తేరుకుని—

"ఎలా జరిగిందీ ఘోరం." అన్నాడు అక్కడేవుండి ఏర్పాట్లు చేస్తున్న డాక్టరుతో.

"ఘోరం ఏముందీ! చచ్చిపోయింది" అన్నాడాయన కఠినంగా.

"ఏమిటి సుస్తీ?" మళ్ళీ అడిగాడు మాధవ్.

"మీకన్న పెద్ద సుస్తీనే"

"అంటే?" త్రుళ్ళిపడ్డాడు మాధవ్.

"ఆవిడకి బ్లడ్ కేన్సర్!"

"బ్లడ్ కేన్సరా?" మాధవ్ గుండె ఝల్లుమంది.

"అవును! భయంకరమయిన కేన్సర్!...అది ఎప్పుడు తెలుసుకుందో తెలుసా? మీరోగం తెలిసిన కొన్నాళ్ళకే. కానీ, ఆ సంగతి మీకు తెలియనివ్వద్దని బ్రతిమాలింది. మీరు తట్టుకోలేరంది. తను మృత్యువుకి చేరువౌతూ మీకు ధైర్యం చెప్పింది. మిమ్మల్ని రక్షించుకోవడానికి నానా అవస్థలూ పడింది!...మనసు ఏడుస్తున్నా పెదవులతో నవ్వింది. మిమ్మల్ని నవ్వించాలని ప్రయత్నించింది. కాని పాపం, కొవ్వొత్తిలా, సమిధలా అంతమైపోయింది." ఆవేశం, ఆవేదన, కోపం, దుఃఖం అన్నీ నిండిన గొంతుతో అన్నాడు డాక్టర్.

మాధవ్ కాళ్ళకింద భూమి కదులుతున్నట్లనిపించింది. తను తిట్టినప్పుడు ఆమె కళ్ళలో కదలాడే భావాలు గుర్తొచ్చి ఒణికి పోయాడు. వెళ్ళేరోజున ఆమె బ్రతిమాలుతూ వెళ్ళద్దని వేడుకోవడం గుర్తొచ్చి చివురుటాకులా కంపించిపోయాడు.

అతని హృదయంలో దుఃఖసముద్రం పొంగింది.

"రాధా!" అంటూ బిగ్గరగా అరిచి దగ్గరగా వెళ్ళబోయాడు.

"ఆగండి!" అది పక్కింటి కల్పన గొంతు.

"ఏమిటి" అన్నట్టు చూశాడు మాధవ్.

"ఇది చదువుకోండి!" అంటూ ఒక లెటర్ ఇచ్చిం దామె.

వణుకుతున్న చేతులతో తీసి చదవడం ప్రారంభించాడు.

"మాధవ్ గారూ! నమస్తే! మీరు చూపించిన ఆదరణకి కృతజ్ఞతలు.

నేను పిచ్చిదాన్ని! అందుకే నా చావు ఎప్పుడో నాకు తెలిసినా నా దిగులుని మనసులోనే దాచుకుని మీకు ధైర్యం చెప్పాలని చూశాను.

మృత్యువుకి అతి సమీపంలోవున్న నన్ను మాటలతో హింసించారు. అయినా నేను బాధపడలేదు. ప్రాణభయంతో ఏదో మతిలేక అంటున్నారే! అనుకున్నాను.

కాన్నీ, మీకు నయం అయ్యాక నన్ను విడిచి వెళ్తారని మాత్రం ఊహామాత్రంగానయినా ఊహించ లేకపోయాను. అందుకే అంటున్నాను మీ అంత తెలివిగలదాన్ని కాను! పిచ్చిదాన్ని!

మీ ఒడిలో తుది శ్వాస తియ్యాలనే కోరికతో మీ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలాను. దిక్కులేని చావు చావకూడ దనే ఆశతో మీ అమ్మగారి కాళ్ళంటి వేడుకున్నాను.

ఇప్పుడు నామనసు ఎంతో ప్రశాంతంగా ఉంది. ఇంక నాకే కోరికలూ లేవు! ఏ బంధాలూ లేవు! నా అంతిమ ఘడి యలు అతి చేరువగా ఉన్నాయని నాకు తెలుసు. అందుకే

దిక్కు లేని నేను, నా అంత్యక్రియలని నేనే ఏర్పాటు చేసు కున్నాను.

నా దృష్టిలో నాకు తండ్రిలాంటి వారు డాక్టర్ గారు. నా బాధలన్నీ ఆయనతో చెప్పుకున్న తరవాత నాకు యెంతో హాయిగా ఉంది! నేను కన్ను మూస్తే "భర్త" అన్న బంధం ఉందని ఎవరయినా మీకు కబురు చెయ్యొచ్చు! వస్తే మీరు రానూ వచ్చు! కానీ,

ఒకవేళ మీరు వస్తేమాత్రం దూరంగా ఉండి అందరిలా రెండు కన్నీటి చుక్కలు తర్పణంగా వదిలి వెళ్ళిపోండి! అంతేగాని నా శవాన్ని తాకనయినా తాకద్దు! నా శవం కూడా మీ స్పర్శ భరించలేదు! ఇదే నా అంతిమ కోరిక.

ఎవరికీ ఏమీ కాని రాధ!"

మాధవ్ చేతిలోని కాయితం జారి గాలికి ఎగిరి పోయింది.

"పదండి! పదండి! ఇంకా ఆలస్యం దేనికి!... అతగా డొచ్చి చూశాడుగా...అవతల ఎండెక్కిపోతోంది!" అన్న మాటకి తృళ్ళిపడి చూశాడు అంతవరకు సర్వం మరచిన మాధవ్.

రాధ శవం ఉత్తరదిశగా సాగిపోతూ కనిపించిందతని మసక బారిన కళ్ళకి.

(కృష్ణాపత్రిక)

(౦)—(౦)